# అభిమాన రచయిత

"డిటెక్టీవ్ పృథ్వీరాజ్ రెండు చేతులూ పైకెత్తి తన ఎదురుగా నిలబడ్డ ఆ మొరటు వ్యక్తి వంక చూశాడు. అతని చేతిలో నల్లని పిస్తోలు నిగనిగ మెరుస్తోంది. లిఫ్ట్ నిశ్శబ్దంగా పైకి వెళ్తోంది..."

చదువుతున్న వెంకట్‌కి ఎవరో తలుపుమీద మునివేళ్ళతో కొట్టిన శబ్దం వినపడింది.

తలుపువైపు చూశాడు. మళ్ళీ వినపడింది చప్పుడు. యీసారి బయట తలుపుకున్న గొళ్ళేన్ని తలుపుమీద కొడుతున్నారు.

కుర్చీలోంచి లేచి నిలబడి మధ్యగదిలోంచి హాల్లోకి వచ్చాడు. మళ్ళీ వినపడింది తలుపు చప్పుడు.

"ఎవరది ?" అడిగాడు ముందు గదిగుమ్మం దగ్గరికి వెళ్ళి.

"ఒసారి తలుపు తీస్తారా !" ఇంగ్లీషులో అడిగారు యెవరో.

వెంకట్ కిటికీకున్న తెరని పక్కకి జరిపి బయటకి చూశాడు. బయట వో ముప్పై అయిదేళ్ళతను నిలబడి వున్నాడు.

"ఎవరు కావాలి ?" అడిగాడు కిటికీలోంచి.

"మిష్టర్ వెంకట్ !"

"మీ పేరు ?"

"చెప్తాను. నా పేరు, చిరునామా, ఎందు కొచ్చిందీ చెప్తాను. తలుపు తీస్తారా ?" ఇంగ్లీషులో అడిగాడు మళ్ళీ.

వెంకట్ తలుపుకివున్న అడ్డగడియని తీసి తలుపు తెరిచాడు

"వెంకట్ మీరేనా ?" అడిగాడు అతను నమ్రతగా ఇంగ్లీషులోనే.

"మీరు ?" అడిగాడు. అతనికి తెలుగురాదని అర్థమైంది వెంకట్‌కి.

"నా పేరు మంజునాథ్...హాసన్ దగ్గరేవున్న వో పల్లెమాది... మిమ్మల్ని చూడటానికివచ్చాను" సంశయిస్తూనే లోపలికి వచ్చాడు అతను.

"వెంకట్ ? మీ కెలా పరిచయం ఆయన" అడిగాడు వెంకట్.

"మీరేనా వెంకట్ ?" అడిగా డతను వెంకట్‌ని ఎదురుగా చూస్తూ.

"కావచ్చు, హాసన్ ? ఎక్కడుంది అది ?"

మంజునాథ్ చిరునవ్వు నవ్వాడు. కుడిచేతిని చాచి వెంకట్ చేతిని అందుకుని కరచాలనం చేస్తూ చెప్పాడు-

"వెరీ గ్లాడ్ టు సీ యు సర్ !"

కుర్చీకోసం వెదికాయి అతనికళ్ళు. మంజునాథ్ అభి ప్రాయం గ్రహించి చెప్పాడు వెంకట్ తలుపు మూస్తూ

'రండి'

మధ్యగదిలోకి దారితీసి వో పేముకుర్చీ చూపించాడు కూర్చోమన్నట్లుగా. అతని యెదురుగా కూర్చున్నాడు వెంకట్.

"యీ చిరునామా యెలా తెలుసు మీకు ?" అడిగాడు వెంకట్.

అతను జేబులోంచి చేతిరుమాలతీసి మొహం తుడుచు కుని, వోసారి ఆ గదివంక పరిశీలనగా చూశాడు.

"ఆ పుస్తకాలు మీరు రాసినవేనా ?" అడిగాడు గోడకున్న అద్దాల అలమారలో కనపడుతున్న పుస్తకాలని చూసి.

"నే రచయితనని యెందు కనుకుంటున్నారు ?" అడి గాడు వెంకట్.

"నాకు మీ కథలంటే చాలా యిష్టం. ముఖ్యంగా మీరు వ్రాసే డిటెక్టివ్ కథలంటే యింకా యిష్టం. కన్నడం లోకి మీకథలు చాలా అనువదింపబడి ప్రచురింపబడ్డాయి"

"హసన్ కర్ణాటక రాష్ట్రంలో వుందా ?"

"అవును. బెంగుళూర్ కి వందకిలోమీటర్ల దూరంలో"

"మీరు రచయిత ననుకునే వెంకట్ ని కాదు నేను" చెప్పాడు వెంకట్ పైప్ అందుకుంటూ.

అతను చిన్నగా నవ్వాడు.

"నాకు తెలుసు, రచయితగా మీ పేరు తప్ప వ్యక్తిగతంగా మీరు గుర్తింపబడటం అంటే ఇష్టంలేదని."

వెంకట్ టొబాకో ఫ్లేక్స్ వున్న సంచీని అందుకున్నాడు బదులుగా మౌనంగా వుండిపోయాడు పైప్‌లో ఫ్లేక్స్‌ని పేరుస్తూ.

"మిమ్మల్ని కలుసుకోడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది."

"అతను టీపాయ్ మీది అగ్గిపెట్టె అందుకుని వెంకట్ పైప్‌ని అంటించాడు.

"మీరు చాలా బాగా రాస్తారు..."

"వెంకట్ బాగా రాయవచ్చు. అతని కథలు నేనెన్నడూ చదవలేదు. నేను మీ రనుకుంటున్న వెంకట్ ని కాదు."

"బుకాయించకండి సార్. మీరు రచయిత వెంకట్"

మౌనంగా పైప్ పీలుస్తూండి పోయాడు వెంకట్ అతనివంక పరిశీలనగా చూస్తూ.

"కనీసం మీ పేరు వెంకట్. ఒప్పుకోరా! మీ పక్కయింటివాళ్ళు చెప్పారు మీ పేరు వెంకట్ అని."

చిన్నగా నవ్వాడు వెంకట్.

"ఆల్ రైట్. నా పేరు వెంకట్. కాని రచయితను కాదు."

"మిమ్మల్ని యిలా కలవడానికి నే నెంత అవస్థ పడ్డానో మీకు తెలియదు. ముందర మా పల్లెనుంచి మీ కథలు ప్రచురించిన ఓ కన్నడ పత్రికకి రాశాను, మీ చిరునామా తెలియచేయవలసిందిగా. మీ చిరునామా వాళ్ళదగ్గర లేదని జవాబు వచ్చింది."

వెంకట్ మౌనంగా పైప్ తాగుతూ వినసాగాడు మంజునాథ్ మాటలు.

"ఆ తర్వాత అనువాదకురాలి చిరునామా పంపమని వ్రాశాను. ఆవిడ అనుమతి లేకుండా చిరునామా యివ్వమని జవాబు వచ్చింది మళ్ళీ. కాని నా వుత్తరం ఆవిడకి పంపించారు. ఆవిడ తన చిరునామా తెలియచేయలేదు. కాని ఉత్తరం రాసింది, ఆవిడ దగ్గరకూడా మీ చిరునామాలేదని. మీ కథలు ప్రచురింపబడ్డ పత్రికలు, అనువాదానికి పర్మిషన్ లెటర్స్ మాత్రం పంపుతారుట మీరు ఆవిడకి."

"ఇంట్రస్టింగ్" చిన్నగా నవ్వాడు వెంకట్ పొగపీల్చి వదులుతూ.

"ప్రతీనెలా తప్పనిసరిగా మీ కథ ప్రచురించే వో తెలుగు డిటెక్టివ్ మాసపత్రిక ఎడిటర్కి రాశాను మీ చిరునామా తెలుపమని. ఆ ఎడిటర్ జవాబు రాశాడు తన దగ్గర మీ చిరునామా లేదని."

"ఆ తర్వాత ?"

"హైద్రాబాద్ వచ్చి ఆ పత్రిక ఎడిటర్‌కి ఫోన్ చేసి అడిగాను మీరు నా అభిమాన రచయిత అనీ, మీ చిరు నామా కావాలని. మళ్ళీ అదేమాట చెప్పాడు మీ చిరు నామా లేదని"

"సాధారణంగా రచయిత పర్మిషన్ లేకపోతే యెంత అభిమాన పాఠకులకయినా చిరునామా యివ్వరు ఎడిటర్స్."

"మీరు పంపే కథలు నచ్చకపోతే తిరిగి ఎవరికి పంపు తారని అడిగాను. 'నచ్చనివి అరుదు. అలాంటివి చింపే స్తాము' అని చెప్పాడు ఎడిటర్."

"ఆ తర్వాత ?" వుత్సాహంగా అడిగాడు వెంకట్.

"మరయితే పారితోషికం యెలా పంపుతారు ?" అని అడిగాను. మీ పేరున చెక్ వ్రాసి మీ బ్యాంక్ యెకౌంటు నంబరు ఉదహరిస్తూ మీ బ్యాంక్‌కి పంపుతామని చెప్పాడు.

"బ్యాంక్ యెకౌంటు నంబరు యిచ్చారా యెడి టర్ ?" అడిగాడు వెంకట్.

"ఆయన ఫోనులో మాట్లాడిన పద్ధతినిబట్టి తెలిసి పోయింది అడిగినా చెప్పడని. రెండు రోజులాగి ఆ పత్రిక ఆఫీసుకు వెళ్ళాను. ఎడిటర్‌ను కలిసి మీ చిరునామా అడి గాను. లేదన్నాడు. కథలు పోస్ట్‌లో వస్తాయని, ప్రచురించి

నాకు రాయల్టి స్క్రిప్టుమీద వ్రాసిన బేంక్ కి మీ ఎక్కౌంట్‌లో క్రెడిట్ చేయమని చెక్ పంపుతామనీ చెప్పాడు.

నిరుత్సాహ పడ్డట్లుగా నటించి చెప్పాను, కన్నడ సినిమా నిర్మాతననీ, మీరు ఈ మధ్య వ్రాసిన ఓ నవలను కన్నడంలో సినిమాగా తీయటానికి మిమ్మల్ని కలుద్దామని బెంగుళూరునుంచి వచ్చానని, కన్నడ దేశంలో రచయితలను కలవటం తేలిక అన్నాను.

ఆయనకు మీరంటే అభిమానం. మీరు ఎట్టి పరిస్థితులలో ఎక్కౌంట్ నంబర్ ఎవరికీ యివ్వవద్దని చెప్పారని అయినా మీ నవల సినిమాగా తీసే ప్రయత్నంలో వున్నాను కాబట్టి, మీ మంచికోసమే కాబట్టి ఆ బేంక్, ఎక్కౌంట్ నంబర్ నాకు తెలియజేశాడు. హైదాబాద్‌లోనే వుంది ఆ బేంక్."

"బేంక్ కి వెళ్ళి ఏజెంటుని అడిగారా వెంకట్ చిరునామా?"

"అవును. మీ చిరునామా అడిగితే బేంక్ రూల్సు ప్రకారం అది యివ్వటానికి కుదరదని చెప్పాడు."

"అర్ధరాత్రి బేంకులోకి జొరబడి ఫైల్స్ తిరగేసి పట్టుకున్నారా ఎడ్రస్?" నవ్వాడు వెంకట్.

మంజునాధ్ నవ్వలేదు.

"మీరు అలాంటి సన్నివేశంలో కథలో ఏ విధంగా రాస్తారో అదే విధంగా చేశాను... మర్నాడు కౌంటర్‌లోని క్లర్కు దగ్గరకు వెళ్ళి నేను వెంకట్‌నని, మద్రాసునుంచి

వచ్చిన రెండు చెక్ లు డిపాజిట్ చేసి నెలయినా అవి కలెక్ట్ చేయబడి క్రెడిట్ కాలేదని, వాటిని నా పాత చిరునామాకే తిప్పి పంపారని, కొత్త చిరునామా వాళ్ళ రికార్డ్సులో నమోదు అయిందో, లేదో చూడమని కోరాను. అతను నా ఎకౌంటు వున్న లెడ్జర్ తెరిచి మీ చిరునామా చెప్పాడు దాన్ని గుర్తుపెట్టుకున్నాను."

"మీరు డిటెక్టివ్ కథారచయితగా చక్కగా పనికి వస్తారు."

"కానీ మీరు యింకా తెలివయినవారు. బేంక్ లో ఎకౌంట్ తెరిచేటప్పుడు ఇచ్చిన చిరునామా తప్పు. అసలు సికింద్రాబాద్ లో గణపతి రోడ్ లేదు, రెండు రోజులు ఆటోలో తిరిగాక అది తప్పు చిరునామా అని తేలింది."

"ఆ తర్వాత?"

"ఆలోచించాను. బేంక్ ఎకౌంటులోంచి మీరు డబ్బు విత్ డ్రా చేయటానికి వస్తుంటారు బేంక్ కు తరచు. అందుకని బేంక్ కి వెళ్ళాను."

"కాపేసి, నేను ఆ ఎకౌంటులోంచి డబ్బు విత్ డ్రా చేస్తుండగా చూసి నన్ను వెంబడించి వచ్చారు ఇక్కడికి. అవునా?" వెంకట్ నవ్వాడు.

మంజునాథ్ వెంకట్ వంక చూశాడు చురుగ్గా. ఆ చూపులో ఆరాధనా భావం, కోపం రెండూ కలిసి వున్నాయి.

"మీరు అంత తెలివితక్కువ వాళ్ళయితే యింత మంచి డిటెక్టివ్ కథా రచయిత అయివుండేవారు కాదు... అలా చేసివుంటే ఎప్పటికీ మిమ్మల్ని కలిసివుండే వాడ్ని కాను."

"అంటే?"

"మీది చెక్ సౌకర్యంతో తెరువబడ్డ ఎకౌంటు కాదు. కనీసం వుండాల్సిన బేలన్స్ అయిదురూపాయలు మాత్రమే మీ ఎకౌంటులో తరచువచ్చే చెక్ల తాలూకు మొత్తం అయిదు వందలు దాటగానే అయిదు వందలు విశాఖపట్నంలో అదే బేంక్ లో తెరచిన మరో ఎకౌంటుకి ఆటోమేటిక్ గా మెయిల్ ట్రాన్స్ఫర్ చేసే విధంగా ఏర్పాటు చేసుకున్నారు మీరు.

అంతేకాదు. ఫోర్జరీ జరగకుండా వుండాలనే ఆలోచనతో అనుకుంటాను ఆ ఎకౌంటు నుంచి జబ్బు కేవలం ఎకౌంటు మూసేటప్పుడు తప్ప, విత్ డ్రాయల్స్ వుండకూడదనీ ఏర్పాటు చేసుకున్నారు. మళ్ళీ అక్కడ మీ అపరాధ పరిశోధక కథల బుర్ర పనిచేసి వుంటుంది. అవునా?"

వెంకట్ జవాబు చెప్పలేదు. పొగాకు పైప్లో వేసుకుని గుప్పుగుప్పున పొగ పీల్చాడు.

"విశాఖపట్నం వెళ్ళాను. అక్కడ ఎకౌంటు కేవలం మీ పేరు మీదే లేదు. అది జాయింటు ఎకౌంటు. వైజాగ్ పోర్టులో పనిచేస్తున్న మీ తమ్ముడితో కలిసి మీరు తెరిచిన ఎకౌంటు అది.

"వైజాగ్ వెళ్ళారన్నమాట."

"నిజంగా మీ తెలివికి, యింత పకడ్బందీగా చేసిన ఏర్పాట్లుకి కంగ్రాట్స్ చెప్పకుండా వుండలేకపోతున్నాను. మీరు యింత రహస్యంగా వుండాలని కోరుకొంటున్నారంటే, మీ అభిమానులు ఇదివరలో తరచు వచ్చి మిమ్మల్ని యెంతగా ఇబ్బంది పెట్టేవారో ఊహించగలను."

"మీరు చెప్పే కథ సస్పెన్సులో ఆపేశారు. ఆ తర్వాత ?"

"ముగింపు మీకూ తెలుసు. మీ కథల మీద వచ్చే డబ్బుతో కాదు మీరు బ్రతికేది. పెన్షన్, యింటి అద్దెలు, బహుశ రిటైరయినప్పుడు మీకు వచ్చిన ప్రావిడెంటుఫండ్, గ్రాట్యుయిటీ మొదలయిన వాటితో మీ జీవనం సాగుతోంది. మీ తమ్ముడితో చెప్పారు మీ తదనంతరం ఆ డబ్బు అనాథశరణాలయంలాంటి మంచి కార్యం కోసం తమరు వుపయోగించే ఉద్దేశ్యంతో వున్నారని, అందుకు తగ్గ ఏర్పాట్లు ఇదివరకే చేశారని."

"వైజాగ్‌లోని వెంకట్ తమ్ముడు యిచ్చాడా ఈ చిరునామా ?"

"అడిగితే వెంకట్ నా అన్నయ్యే కాని కథా రచయిత కాదని బుకాయించాడు. చిరునామా యివ్వలేదు."

"ఇవ్వకపోతే ఇక్కడికి ఎలా వచ్చారయితే ?"

" మీ తమ్ముడు మీకు ఉత్తరాలు రాస్తుండచ్చు తరచు. మీ తమ్ముడు ఇంటి సందులోనే వుంది గోడకు వ్రేలాడే చిన్న పోస్టుబాక్స్. వారంరోజులు ఓపికగా కాపేశాను. ఓరోజు మీ తమ్ముడి కొడుకు ఉత్తరాలు పోస్టు చేశాడు కొన్ని. ఇనుపవైరుతో గోడకు వ్రేలాడే ఆ డబ్బాని ఎత్తుకెళ్ళిపోయాను అప్పటికప్పుడే సంచీలో పెట్టుకుని. హోటల్ గదికెళ్ళి తాళం పగలకొట్టి లోపలవున్న వుత్తరాలన్నీ తీసి మీ పేరుగల వుత్తరంకోసం వెతికాను. మీ పేరు చిరునామా, మీ తమ్ముడి ఫ్రమ్ ఎడ్రస్ గల ఇన్‌లెండ్ కవరు దొరికింది. మీరు హైదరాబాదులోనే వున్నారని తెలిసి ఆశ్చర్యపడ్డాను."

"అలా పోస్ట్‌డబ్బా దొంగతనం చేయడం నేరం..."

"...అని మీరు మీ నవల 'రేపులేదు'లో సహస్రబుద్ధిచేత అలా చేయించారు, కిరణ్మయి చిరునామా తెలుసుకోటానికి. మీరు రాసిన ఓకథలోని సన్నివేశంవల్లే మీదగ్గరికి రాగలిగాను."

మీరు డిటెక్టివ్ కథారచయితగా కాదు, డిటెక్టివ్‌గానే పనికొస్తారు."

"థాంక్స్. కాని మా కథల్లో సాధారణంగా డిటెక్టివ్‌ల కన్నా హంతకులే ఎక్కువ తెలివితేటలు కలిగి వుంటారు. నవ్వాడు.

"అంటే నేను రచయిత వెంకట్‌నే నన్నమాట?" నవ్వాడు.

"తప్పకుండా. ఇంత శ్రమపడి మీ దగ్గిరకి వచ్చిన అభిమాన పాఠకుడిని యింకా నిరుత్సాహపరచటం న్యాయమా చెప్పండి?"

"సారీ. మీకు చాలా శ్రమయిచ్చాను. యింత కాలం, దాదాపు నాలుగు సంవత్సరాలుగా నా చుట్టూ రహస్యంగా అల్లుకున్న గూడుని ఛేదించగలిగారు మీరు. నిజంగా హార్టీ కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్ యూ సార్. మరి నా ప్రశ్నకి సమాధానం?"

"మళ్ళీ అడగండి."

"డిటెక్టివ్ తెలివి తేటలు చివరలో కాని బయట పడవే?"

"కారణం హంతకుడు డిటెక్టివ్ ఆలోచనాధోరణి వూహించగలిగాడు కాబట్టి ముందే జాగ్రత్తపడతాడు. డిటెక్టివ్ హంతకుడి తెలివి తేటలు అంచనా వేసేది అతన్ని గురించి వో అవగాహన యేర్పడ్డాకే. అందుకు కొంత సమయం తీసుకుంటుంది."

"మీ కధలు చదువుతూంటే యెంత సహజంగా వుంటాయంటే వొకోసారి నేరం చేయడం యింత తేలికా అనిపిస్తుంది."

"ఆ తర్వాత వాళ్ళు పడే కష్టాలు యెలాంటివో కూడా ప్రతీ కథల్లో విశదీకరిస్తాను. కాదంటారా?"

"నిజమే... కాని..."

"కాఫీ త్రాగుతారా ?"

"కథలు రాయడం వో వరం అయితే మంచి డిటెక్టివ్ కథలు రాయడం యింకో వరం"

"కాఫీ త్రాగుతారా ?"

"ఇంట్లో యెవరూ లేనట్లున్నారు. మీకు వివాహం కాలేదని తెలుసు అఫ్‌కోర్స్, వ్యక్తిగత కారణాలు అడగను లెండి"

"ఫర్వాలేదు. నే చేస్తాను కాఫీ. ఎలక్ట్రిక్ స్టవ్ మీద నిముషాల్లో అయిపోతుంది... నే వ్రాసిన కథలన్నిటిలో మీకు నచ్చిన కథ ఏది."

మంజునాథ్ కళ్ళలోకి కొత్త కాంతి రావడం గమనించాడు వెంకట్.

"బాగా నచ్చిన కథ ! బాగాకాదు. మనస్ఫూర్తిగా నచ్చిన కథ ఒకటుంది. యెంత నచ్చిందంటే పురితీయబోతూ ఆఖరికోరిక యేమిటంటే వోసారి ఆ కథ చదవాలంటాను."

వెంకట్ మొహం యిబ్బందిగా పెట్టాడు. తన కథలని యెవరయినా మొహంమీద ఏమాత్రం పొగడినా, తన భాష రాని పదిమంది కొత్తవాళ్ళమధ్య అకస్మాత్తుగా తీసుకువెళ్ళి వుపన్యాసం యివ్వమని వదిలినట్లుగా ఫీల్ అవుతాడు,

"ఆ కథపేరు 'శివాజ్ఞ లేఁదే' ఆ కథలో హంతకుడు తనకి ద్రోహంచేసిన ప్రియురాలిని కత్తితో చంపి ట్రంక్ పెట్టెలో పెట్టి, హతురాలి గుర్తు తెలియకుండా వుండడానికోసం ట్రంకు పెట్టెనిండా అంగుళం ఖాళీలేకుండా కరిగించిన తారు పోసి ఓ రైల్లో వదులుతాడు ఆ పెట్టెని. పోలీసులు ఆ పెట్టె తెరిచేసరికి గడ్డకట్టిన తారుతప్ప మరేం వుండదు. తారు లోపల శవం. శవం వంటిమీద తారు పోదు వరిగ్గా. యెంత ప్రయత్నించినా శవాన్ని గుర్తించలేరు..."

యెంతో ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు మంజునాథ్.

"అవును. ఆ కథ బావుందని చాలామంది రాసిన ఉత్తరాలు చూశాను పత్రికలో. ఆ కథ కన్నా నా ఉద్దేశంలో చదరంగంలో హత్య..."

"అది ట్విస్ట్ కథ. కాని యిదిమీరే హత్యచేయాలని వూహించి. పథకం వేసుకొని రాశారా అనిపించేకద..."

వెంకట్ లేచి హాల్లో వో మూల చిన్న కాఫీ టేబిల్ మీద వున్న ఎలక్ట్రిక్ స్టవ్ ప్లగ్‌ని పాకెట్‌లో వుంచి దానిమీద గిన్నె వుంచాడు. అందులో పక్కనేవున్న గాజు జగ్గులోని పాలని పోశాడు.

"మీరు నిజంగా హత్యచేయాలని అన్నివిధాలుగా ఆలోచించిరాస్తారా లేక ఆ కథ పరిధినిమాత్రమే దృష్టిలో వుంచుకుని రాస్తారా?" అడిగాడు మంజునాథ్.

"విమర్శకులు తప్పుపట్టకుండా వుండేలా ప్లాన్ చేసుకుంటాను. తర్వాత సహజత్వానికి దూరంగా వుండకుండా జాగ్రత్తపడతాను."

"నాకు మీ తెలివితేటలమీదా, మీ ఆలోచనాసరళి మీదా చాలా నమ్మకం ఏర్పడింది మీకథలుచదివాక. మీకథలు..."

"చక్కెరలేకుండా తాగుతాను నేను. మీకు?"

"నాకు షుగర్ వ్యాధిలేదు చక్కెర ఎక్కువవేయండి. మీ వయసు వచ్చాక మానేస్తాను చక్కెర" నవ్వాడు మంజునాథ్.

ఆ నవ్వులో అదివరకటి సౌమ్యత లేదు. మర్యాద అసలే లేదు.

వెంకట్ వింతగా చూసాడు అతనివంక.

"నేను రెండుహత్యలు చేసిన హంతకుడినని తెలిస్తే మీరెలా ఫీల్ అవుతారు?' అడిగాడు మంజునాథ్.

వెంకట్ నవ్వాడు.

"ఏమో? అవాలిగా మీరు!" అన్నాడు.

"మీ కథల్లోపాత్రలు ఎలామాట్లాడుతాయోఅలాగే మాట్లాడుతున్నారు మీరు. నిజం నేను ఇద్దరిని చంపాను."

"కాఫీ తాగుతూ వివరాలు చెప్తురుగాని కొత్త కథకి ప్లాట్ దొరుకుతుంది ఇవాళ" మళ్ళీ నవ్వాడు వెంకట్, పాలలో చెంచాతో ఇన్‌స్టాంట్ కాఫీపొడి వేస్తూ.

"ఆ అవకాశం మీకివ్వను."

"మీరే ప్రాసిక్యూషన్ లో వున్నారా?" అడిగాడు కాఫీ టేబిల్ మీదవున్న సాసర్ల మీద బోర్లించివున్న కప్పులని అందుకుంటూ.

"కాదు! మీరు రాసిన 'శివాజ్ఞ లేక దే...' కథలోలాగా చేసాను మొదటిహత్య. ఇంక మీరు కొత్తగా రాసేదేమీ లేదు అందులో."

మంజునాథ్ కంఠంలో ఇదివరకు తనమీద చూపించిన మర్యాదలేదని గ్రహించాడు వెంకట్. కఠినంగావున్నాయి మాటలు. అతనివంక చూసాడు. మంజునాథ్ ఆవేశపడుతున్న గుర్తుగా అతని నుదుటిమీదవున్న నరాలువుబుకుతున్నాయి.

ఆశ్చర్యంగా చూసాడు వెంకట్.

"అలా అయిపోయారేమిటి?"

"నీవలే."

మంజునాథ్ కంఠంలో అకస్మాత్తుగా కోపం, ద్వేషం.

"సంగతేమిటో చెప్పండి."

"నీవల్ల నేను నాభార్యనే చంపుకున్నాను."

"నావల్లా...?"

"అదే. నీ... నువురాసిన కథవల్ల ... నీమీద నమ్మకంతో నీ రచనలమీద నమ్మకంతో."

"వివరంగా చెప్పండి. ఆవేశపడకండి."

"చెప్తాను. మీకథ 'శివాజ్ఞ లేనిదే...' లోలాగా నా భార్యని హాసన్‌నుంచి నాగపూర్ తీసుకెళ్ళాను అక్కడ ఓ ట్రంక్ పెట్టె. తారుసంపాదించాను. ఆకథలోలాగే దాన్ని చంపి ట్రంక్‌లో ముందర కరగించిన తారుపోసి తర్వాత శవాన్ని పడుకోబెట్టి శవంమీద పెట్టె నిండేలాగా తారు పోశాను. తారు గట్టిపడ్డాక తాళంవేసి, నాగపూర్‌లో ఎక్కించాను. ఆ ట్రంక్ పెట్టె ఢిల్లీ చేరింది నేను బెంగుళూరు చేరాను. నన్నెవరూ పట్టుకోలేరనుకున్నాను. కాని రెండు నెలలతర్వాత ఓరోజు ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ వచ్చి అరెస్ట్ చేశాడు. నాభార్యని హత్యచేసిన నేరంమీద.'

"ఎలా కనుక్కున్నారు మిమ్మల్ని?" ఆసక్తిగా అడిగాడు వెంకట్.

"నాభార్య శవాన్ని కెమికల్ లోషన్‌లలో కడిగారు. బాగా కమిలిపోయింది శరీరం. ఎవరూ గుర్తుపట్టలేరు. కాని పోస్ట్‌మార్టమ్‌లో నాభార్యవయసు, ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగినసంగతి, చిన్నప్పుడు ఎడంభుజంమీద అయిన గాయం తాలూకు మచ్చ, వెజిటేరియన్ అనేవిషయం, జడ పొడుగు, మరణించిన రాత్రి తిన్న పదార్థాలు. జుట్టుకి రాసుకున్న హేరాయిల్, మొదలయిన వివరాలు సేకరించారు.

ఆనవాయితీగా ఆ వివరాలు దేశంలోని ప్రతీ రాష్ట్ర రాజధానిలోని ఐ జి పి. కి పంపారు. బెంగుళూరులోని ఐ జి. కర్ణాటకరాష్ట్రంలోని డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్

స్టేషన్ లకి పంపాడు ఆ రిపోర్ట్. నాగపూర్ నుంచి తిరిగిరాగానే హసన్ డిస్ట్రిక్ట్ పోలీస్ స్టేషన్ లో నాభార్య ఎవరితోనో లేచిపోయిందని కంప్లెయింట్ ఇచ్చాను. అది తిన్న గోధుమ రొట్టెల వివరాలు వున్నాయి ఆ మెడికల్ రిపోర్ట్ లో.

నేనొక్కడినే నాగపూర్ వెళ్ళానని, తిరిగివచ్చేసరికి లేదని రాసాను కంప్లెయింట్ లో. అది అబద్ధం అని తేలింది దాని కడుపులోని ఆహారంవల్ల. నాగపూర్ లో రొట్టెలు, హసన్ లో అన్నంతింటారు. ఆ శవం వయసు మొదలయినవి భర్తకి సరిపోతాయి. మొత్తమ్మీద బయటపడింది అంతా. చివరికి నాకు యావజ్జీవ కారాగారశిక్ష వేశారు!"

"యావజ్జీవం? అయితే యిక్కడెలా వున్నారు?"

"జైల్లోకి అడుగుపెట్టినరోజు అనుకున్నాను తప్పించుకోవాలని. తప్పించుకున్నాను నన్ను పట్టుకున్న సబిన్ స్పెక్టర్ ని చంపాలి ఆ హత్య నా స్వంతబుర్ర వుపయోగించి చేశాను. ఇప్పుడతని శవం ఓ డ్రమ్ములోని తారులో గట్టిపడ్డ నర్మదా నదిలో మునిగివుంది. మూడోది నీపని. చంపాక నీశవాన్ని తారు డ్రమ్ములో వేసి దాన్ని హుస్సేన్ సాగర్ లో పారేస్తే చాలు."

"దేనికి నన్ను చంపడం?" నవ్వుతో అడిగాడు వెంకట్ ట్రేలో కాఫీకప్పులు సర్దుతూ.

"ఇలాంటికథలు బాధ్యతారహితంగారాసిదేశంమీదికి

వదిలితే, నాలాంటివారికి నేరాలు ఎలా చేయాలో నేర్పి నట్లవుతుంది. కాబట్టి నీ కథచదివి, మెచ్చుకుని, ఇన్స్పయిర్ అయి, ఆ హత్య చేసివుండకపోతే నాభార్యకి విడాకులుఇచ్చి, ఇంకోవివాహం చేసుకునేవాడిని. కేవలం ఆ కథ, ఆ ఒక్క కథవల్ల, నీ కలంనుంచి వచ్చిన ఆ కథవల్ల నా జీవితం పాడు చేసుకున్నాను.

"మీరు హత్యచేసేవుద్దేశంలో నన్ను సంప్రదించి వుంటే, నేను ఆ కథలోలాగా చేయమని సలహాఇచ్చివుంటే, నాసలహా ఆచరించాక పట్టుబడితే, అప్పుడు నేను నిజంగా బాధ్యుణ్ని అయేవాడిని. మీరు హత్యచేస్తారనే, చేయాలనే వుద్దేశంతో వ్రాయలేదాకథని నేను."

"కాని అపరాధపరిశోధనగురించి పూర్తిగా తెలియకుండా ఇలాంటికథలురాయడం నీతప్పు. పోస్ట్‌మార్టమ్ చేసేటపుడు ఎలాంటిక్లూలుదొరుకుతాయోకూడా తెలుసుకుని రాసివుండాల్సింది నువ్వు ఆ కథ. అలా జరిగివుంటే నే నింకా జాగ్రత్తపడేవాడిని. అలా చేయనందుకు శిక్ష అనుభవించక తప్పదు."

జేబులోంచి తళతళ మెరిసే స్టీలుకత్తి తీశాడు మంజునాథ్. ఇప్పుడు అతనిఉద్రేకం, కోపం ఛాయమాత్రంగాకూడా లేవు మొహంలో. ఓ స్థిరనిర్ణయానికి వచ్చినట్లుగా వుంది అతని మొహం.

"మీరు చంపదలచుకుంటే ఆపని చేయకమానరు" నవ్వాడు వెంకట్ రెండుకప్పుల్లోకి కాఫీ వంచుతూ.

"నేను జోక్ చేస్తున్నాననుకుంటున్నారా? ఇంతడబ్బు ఖర్చుపెట్టి, కాలం వృథాచేసి ఎందుకు మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చినట్లు? మీరచనలమీద అభిమానంతో మాత్రమే కాదు, కసితో, పగతో, ద్వేషంతో. ఓ చక్కని రచయితని చంపడం-అందులో నా అభిమాన రచయితని-బాధాకరమే అయినా, ఈపని చేస్తేకాని నాకు శాంతిలేదు."

"అలాగే కాఫీ త్రాగచ్చా నేను ?"

కాఫీ ట్రేతో టీపాయ్ వైపు వచ్చాడు వెంకట్ చిన్నగా ఈలవేసూ. మంజునాథ్ లేచినిలబడ్డాడు అప్రమత్తంగా, చేతిలో కత్తితో.

"మీరు నమ్మటంలేదు నే చెప్పేది" అసహనంగా అన్నాడు.

"నమ్ముతున్నాను. కాఫీ తాగండి" గలగలానవ్వాడు వెంకట్.

వెంకట్ కాఫీ చప్పరిస్తూ, అతని చేతిలోని కత్తివంక చూడసాగాడు వచ్చే నవ్వును ఆపుకునే ప్రయత్నం చేస్తూ.

మంజునాథ్ కప్పు అందుకుని రెండుగుక్కలు తాగి చెప్పాడు.

"హాసన్ జిల్లాలో కాఫీఎస్టేట్లు ఎక్కువ. అక్కడ కాఫీ చాలా బావుంటుంది. ఫ్రెష్ ఫ్రమ్ ఓవెన్..."

"నన్ను చంపాక ఏం చేద్దామనుకుంటున్నారు ?"

"ఈ యింట్లోని ఖరీదయిన వస్తువులు, డబ్బు తీసుకు వెళ్తాను డబ్బుకోసం హత్యజరిగిందనుకుంటారు. ఆ తర్వాత గుజరాత్ రాష్ట్రం లోని ఓ చిన్నవూళ్ళో కొత్తజీవితం ఆరంభిస్తాను. అందుకుతగ్గ ఏర్పాట్లు చేసుకొన్నాను."

కాఫీ పూర్తిచేసి కప్పు టీపాయ్ మీద వుంచాడు మంజునాథ్. వెంకట్ కొన్ని క్షణాలతర్వాత తన కాఫీ కప్పునికూడా టేబిల్ మీద వుంచాడు.

"మీరు సిద్ధమేనా?"

మంజునాథ్ లేచి నిలబడ్డాడు కత్తి గట్టిగాపట్టుకుని. కాళ్ళు నేలమీద నిలవలేదు. గాల్లో తేలిపోతున్నట్లుగా అనిపించింది.

"ఏం చేసా...?"

అంతే! స్పృహతప్పింది మంజునాథ్కి. కొన్ని క్షణాల్లో నేలమీదకి వాలిపోయాడు.

నేలమీదపడివున్న మంజునాథ్ వంక చూశాడు వెంకట్. కొన్నిక్షణాలు చిన్నగా నవ్వుకున్నాడు. తర్వాత టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి రిసీవర్ ఎత్తి, ఓ నంబర్ డయల్ చేసి, తన ఇంటి చిరునామా చెప్పి వెంటనేరమ్మని చెప్పాడు.

పావుగంటతర్వాత పోలీసులువచ్చారు. తనని రిటైర్డ్ జిల్లా జడ్జిగా పరిచయంచేసుకున్నాక జరిగింది వివరంగా చెప్పాడు వెంకట్.

"ఇతను చెప్పినదంతా నిజమో, కాదో తణిఖీ చేస్తాం. కాని ఎలా స్పృహతప్పాడు ?"

మార్ఫియాలా త్వరగా పనిచేసే మత్తుపదార్థం కాఫీలో కలిపి ఇచ్చాను."

"మీదగ్గర సిద్ధంగా ఎప్పుడూ వుంచుకుంటారా ఆ మందు ?"

చిన్నగా నవ్వాడు పాకెట్.

"అయిదేళ్ళ క్రితం దిటయిరయ్యే రోజు ఓ వ్యక్తికి ఏడేళ్ళ కఠినశిక్ష వేశాను. 'నే బయటికి వచ్చాక 'నువు బ్రతికి వుంటే నిన్ను తప్పక చిత్రవధ చేసి చంపితీరుతాను' అని బెదిరించాడు. నా సర్వీస్‌లో అలా చాలామంది బెది రించారు. కాని అతను మాత్రం కోపంగా బెదిరించలేదు. చాలా ప్రశాంతంగా శపథం చేసి వెళ్ళాడు.

జైల్లోంచి విడుదల అవగానే అతను చేసే మొదటి ప్రయత్నం నే నెక్కడున్నానో కనుక్కోవటం. అందుకని నేను ఎక్కడ ఉంటున్నానో ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతున్నాను ఇన్నాళ్ళు.

ఒకవేళ అతను ఎలాగయినా నా వునికి తెలుసుకుంటే నన్ను నేను రక్షించుకోడానికి కొన్ని కప్పుల్లో ఆ మత్తు

మందుని పోసివుంచాను. దాంట్లో వేడికాఫీపోస్తే ఆమందు కాఫీలో కరిగి అది తాగిన వ్యక్తిని నిముషంలో స్పృహ తప్పిస్తుంది.

మృత్యువు ఆకస్మాత్తుగా మంజునాథ్ రూపంలో వెదుక్కుంటూవచ్చింది నన్ను కాని ఓడిపోయింది. మంజునాథ్ నాకు ఓవిధంగా మేలు చేశాడు. నా వునికి గురించి మంజునాథ్ తెలుసుకున్న విధంగా ఇకముందు ఎవరూ నన్ను కలుసుకోకుండా తగినఏర్పాట్లు చేసుకుంటాను.”

మంజునాథ్‌ని పోలీసులుతీసుకువెళ్ళాక తనబల్ల ముందు కూర్చుని వెంకట్ అంతకుముందు తను వ్రాస్తున్న డిటెక్టివ్ కథలోని డిటెక్టివ్‌ని లిఫ్టులో వదిలేసి, ఆ కాగితాలని ఫైల్లో వుంచి, కొత్తకథకి ప్లాట్ దొరకడంతో వుత్సాహంగా ఆ కథ వ్రాయడం మొదలుపెట్టాడు.